సాక్షి వికారాబాద్

సోమవారం | 17 | జూలై | 2023



ముక్కిన బియ్యం తినేదెలా?

అధికారుల నిర్లక్ష్యంతో రేషన్ దుకాణాల్లో ముక్కిన, పురుగు పట్టిన బియ్యం సరఫరా అవుతున్నాయి. 8లో▸



పరిగి అభివృద్ధికి కృషి

పరిగి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 8లో▸



పచ్చిరొట్ట.. పంటకు పోషణ

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చు. తద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. 9లో▸

న్యూస్‌రీల్

గెట్ టు గెదర్



ఎంబీబీఎస్ బ్యాచ్ స్నేహితులతో ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తన ఎంబీబీఎస్ బ్యాచ్ స్నేహితులు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన గెట్ టు గెదర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే తన కళాశాల నాటి జ్ఞాపకాలను స్నేహితులతో పంచుకున్నారు. వారి బాగోగులు తెలుసుకున్నారు. స్నేహితులతో సరదాగా గడిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

అనంతగిరి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా నాయకులు కోరారు. ఆదివారం వారు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 7,681 మంది ఎఫ్ఏలు పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే అన్ని బాధ్యతలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాల విజయవంతంలో తాము కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. అయితే రూ. 9,800 వేతనంతో కుటుంబపోషణ భారంగా మారిందని పేర్కొన్నారు. కనీస వేతనం రూ. 24వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మోమిన్‌పేట పీఎస్‌ను సందర్శించిన డీఎస్పీ



డీఎస్పీని సన్మానించిన సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పోలీసులు

మోమిన్‌పేట: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కె.నర్సింహులు కోరారు. ఆదివారం మోమిన్‌పేట పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు సర్పంచ్ అంగేరి శ్రీనివాస్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అంతకుముందు నూతనంగా వచ్చిన సీఐ శివలింగంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విఠల్‌రెడ్డి, బీజేపీ నేత కృష్ణారెడ్డి, నాయకులు బస్వరాజు, రవీందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం



పిడుగుపాటుకు కాలిపోయిన మీటర్

కుల్కచర్ల: చౌడాపూర్ మండలంలో శనివారం రాత్రి భారీ వర్షంతో పాటు పిడుగులు పడ్డాయి. కల్మన్‌కాల్వ గ్రామపంచాయతీ పరిధిలోని రెండు గ్రామాల్లో పిడుగుల వల్ల ఇళ్లలోని విద్యుత్ గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. రూ.50వేల వరకు నష్టం జరిగిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు: మంత్రి సబిత

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు వద్ద లైటింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.2.40 కోట్లు విడుదల చేసినట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్ద చెరువు సుందరీకరణలో భాగంగా ప్రత్యేకంగా లైటింగ్ ఏర్పాటుకు రూ.1.25 కోట్లు, చెరువు వద్ద నిర్మిస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ చుట్టూ రూ.1.15 కోట్లతో లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గంలోని నాలుగు మున్సిపాలిటీలకు రూ.150 కోట్లు ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ఈ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు.



తాండూరు రూరల్: మల్కాపూర్ బోనాల ఊరేగింపు



యాలాలలో పోతురాజుల విన్యాసం



వికారాబాద్ అర్బన్: బోనాల ఊరేగింపులో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు

బోనం.. సంబురం

జిల్లాలో ఆదివారం బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు చేరుకొని గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. పిల్లలు, పెద్దలు, యువతీయువకులు అందంగా ముస్తాబై ఉత్సవాల్లో పాల్గొన్నారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డప్పు చప్పుళ్ల మధ్య సంబురాలు అంబరాన్నంటాయి. ప్రతి వీధిలో బోనాల సందడి కనిపించింది. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్

వరిపైనే గురి

గణనీయంగా పెరగనున్న సాగు విస్తీర్ణం

- చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండడమే కారణం
- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 77,554 ఎకరాలు
- ఈ ఏడాది అదనంగా మరో 19వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా
- నారుమళ్లు సిద్ధం.. నాట్లు ప్రారంభం
- శాస్త్రీయ పద్ధతులు పాటించాలంటున్న వ్యవసాయ శాఖ



దోమ మండలంలో వరి నాట్లు వేస్తున్న రైతులు

వికారాబాద్: ఈ ఏడాది వరి సాగు గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల నాట్లు కూడా ప్రారంభించారు. మరో వారం రోజుల్లో వరినాట్లు ఊపందుకోనున్నాయి. పరిగి, కొడంగల్, దారూరు, కోట్‌పల్లి, యాలాల, తాండూరు, బషీరాబాద్ మండలాల్లో అత్యధికంగా వరి సాగు చేస్తారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 77,554 ఎకరాలు. అయితే గతేడాది వర్షాలు బాగా కురవడంతో పెద్దపెద్ద చెరువులు, ప్రాజెక్టుల్లోకి నీరు పుష్కలంగా చేరింది. దీంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగనుంది. గత యాసంగి సీజన్‌లో 90వేల ఎకరాల్లో వరి సాగు కాగా ఈ ఏడాది 95,690 ఎకరాలు సాగు కావచ్చని వ్యయసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు జిల్లాలో 320 ఎకరాల్లో వరి పంట వేశారు. సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఆగస్టు చివరి వారం వరకు నాట్లు వేసుకోవచ్చని వారు తెలిపారు.

విత్తన ఎంపికే కీలకం

ప్రస్తుతం జిల్లా రైతులు బీపీటీ 5204, ఎంటీయూ 1010, ఎంటీయూ 1001, చిట్టిముత్యాలు తదితర రకాలు సాగు చేస్తున్నారు. అయితే వీటితో పాటు సాంబామసూరి, భరణి, కాటన్‌దొర సన్నాలు, సోమశిల, సింహపురి, తెలంగాణ సోనా, కెఎన్ఎం సన్నాలు తదితర రకాలను వానాకాలంలో సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని అధికారులు అంటున్నారు. ఈ రకం విత్తనాలు సాగు చేస్తే ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తుందని తెలిపారు. రబీ సీజన్‌లో అయితే మరో 5నుంచి 10బస్తాలు పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. మిల్లర్లు సైతం ఈ రకాలను కొనుగోలు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది.

విత్తన శుద్ధి తప్పనిసరి

విత్తన రకం ఏదైనా ముందుగా శుద్ధి చేసుకోవడంతో మంచి ఫలితాలు వస్తాయని అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా వరికి కాండం తొలుచు పురుగు, ఆకుముడత తెగులు, దోమపోటు, అగ్గితెగులు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాండం తొలుచు పురుగు నివారణకు నారుమళ్లలో ఒకటిన్నర కిలోల గుళికల మందు చల్లుకోవాలి. నాట్లు వేసిన 20 రోజులకు ఎకరాకు 8 నుంచి 10 కిలోల వాసన రాని గుళికల మందు వేసుకోవాలి. ఆకుముడత తెగులు నివారణకు కొలరోపైరిపాస్ లేదా మోనొక్రోటోపాస్ మందును పిచికారీ చేసుకోవాలి. దోమపోటు నివారణకు ఇమిడా క్లోరోఫిడ్ మందును, అగ్గితెగులు నివారణకు ట్రిసోక్లోజోన్ మందును పిచికారీ చేసుకోవాలి. ఈ మందులను మోతాదుకు మించి వాడరాదని అధికారులు సూచించారు.

అందుబాటులో విత్తనాలు



జిల్లా రైతులు అధిక మోతాదులో ఎరువులు వాడుతున్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడితే లాభాల కంటే అనర్థాలే ఎక్కువ. యూరియా ఎక్కువగా వాడడం వల్ల పైరు ఎక్కువగా పెరగడం, పచ్చగా మారడం వల్ల పంటను ఆశించే పురుగులు, చీడపీడల శాతం పెరిగి దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం.

– గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి, వికారాబాద్

దరఖాస్తుకు వేళాయె..

- ఆగస్టు31 వరకు 'ఇన్‌స్పైర్ మనక్'కు గడువు
- ప్రతి పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు
- గత ఏడాది 75 ప్రయోగాల ఎంపిక



వికారాబాద్ అర్బన్: విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టి, వారిని భావి శాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనక్ పేరిట అవార్డులు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ప్రయోగాలకు అవసరమయ్యే ఖర్చులను ఇచ్చి అండగా నిలుస్తోంది. దీంతో విద్యార్థులు ప్రతి ఏటా కొత్తకొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారు. గత ఏడాది జిల్లా నుంచి 700 మంది విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తు చేసుకోగా 75 ప్రయోగాలు ఎంపికయ్యాయి. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని అధికారులు తెలిపారు.

6నుంచి 10వ తరగతి విద్యార్థులకు..

ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో 6నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ ప్రయోగాలు చేయవచ్చు. విద్యార్థులు ముందుగా వారు ప్రదర్శించే ప్రయోగాల వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వాటిని ఎస్ఐటీ వారు పరిశీలించి ఉత్తమ ప్రయోగాలను ఎంపిక చేస్తారు. ఇలా దేశ వ్యాప్తంగా లక్ష ప్రయోగాలను ఎంపిక చేస్తారు. అందులో 10వేల ఉత్తమ ప్రయోగాలకు ఒక్కో దానికి రూ. 10వేలు కేటాయిస్తారు. ఈ డబ్బులను కేంద్ర ప్రభుత్వం నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఈ డబ్బులతో ప్రయోగానికి అవసరమైన వస్తువులను కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. ఇన్‌స్పైర్ మనక్‌లో పాల్గొనే విద్యార్థులు 10నుంచి 15 ఏళ్ల లోపు వారై ఉండాలి.

దరఖాస్తు చేసే విధానం

ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు దరఖాస్తు చేసే విద్యార్థికి బ్యాంక్ అకౌంట్ ఉండాలి. ఆధార్ నంబర్, రెండు పాస్ ఫొటోలు, బ్యాంక్ ఖాతా నంబర్‌ను స్కాన్ చేసి, ప్రయోగానికి సంబంధించిన పేరును, వివరాలను, సంక్షిప్తంగా ఓ పేపరుపై రాసి స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. పాఠశాల డైస్ నంబర్, మెయిల్ ఐడీ, పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, ప్రధానోపాధ్యాయుడి పేరు, సైన్స్ టీచర్ పేరు, ఇన్‌స్పైర్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయుడి పేరుతో పాటు సెల్ నంబర్, పాఠశాల పూర్తి చిరునామాతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న 48గంటలలోపు విద్యార్థి మెయిల్‌కు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ వస్తాయి. వీటిని జాగ్రతగా గుర్తుంచుకుంటే దరఖాస్తు చాలా తేలిక. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఆధారంగా విద్యార్థుల వెబ్‌సైట్ నుంచి నామినేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు

అబ్దుల్లాపూర్‌మెట్: కిరాణా దుకాణాల ముసుగులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణాలపై దాడిచేసి ఇద్దరిపై కేసు నమోదు చేసిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలో ఆదివారం బోనాల సందర్భంగా వైన్స్ దుకాణాల బంద్ ఉన్న నేపథ్యంలో అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన బైరు ప్రభాకర్ అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు దాడిచేయగా.. వివిధ బ్రాండ్లకు చెందిన రూ.12వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా లష్కర్‌గూడ రెవెన్యూ పరిధిలో ఎస్‌బీఐ బ్యాంక్ పక్కనే ఉన్న బేకరీలో సైదులు.. అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో అతడి దుకాణంపై దాడిచేసి రూ.65 వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



నిర్వహణ సరిగా లేని ఎల్ఐజీ కాలనీలోని మున్సిపల్ పార్క్

ఆహ్లాదం హుష్‌కాకి..

- ప్రజలకు ఉపయోగపడని పార్కులు
- లక్షలు ఖర్చు చేసి ఆట వస్తువులు ఏర్పాటు
- పాడైపోయిన ఓపెన్ జిమ్ పరికరాలు
- పట్టించుకోని మున్సిపల్ శాఖ


పార్కుల అభివృద్ధికి చేసిన ఖర్చు లక్షల్లో..

2019-20	-	రూ. 14.60
2020-21	-	రూ. 22.72
2021-22	-	రూ. 47.68
2022-23	-	రూ. 6.98

వికారాబాద్ అర్బన్: పిల్లలు ఆడుకోవాలన్నా.. పెద్దలు కాసేపు సేద తీరాలన్నా పార్కులే శరణ్యం.. అయితే పార్కుల అభివృద్ధికి, నిర్వహణకు, అందులో పిల్లల ఆట వస్తువుల ఏర్పాటుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చిస్తోంది. అయినా ఫలితం కనిపించడం లేదు. ఇందుకు నిదర్శనం జిల్లా కేంద్రంలోని పార్కులే. పట్టణంలో ఒక్క పార్కు కూడా అనుకూలంగా లేదు. గాంధీ పార్కు కూడా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. మిగతా పార్కులు మరీ దారుణంగా మారాయి. ఆధునీకరణ పేరుతో పలుమార్లు లక్షలు ఖర్చు చేసినా ఫలితం కనిపిండం లేదు. వికారాబాద్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నా అనుకున్న ఫలితాలు రాలేదు. పట్టణంలోని 6 పార్కుల అభివృద్ధికి మున్సిపల్ అధికారులు పెద్ద ఎత్తున ఖర్చు పెట్టినా ఒక్కటి కూడా ఉపయోగంలో లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో అన్ని పార్కులు బురదమయంగా మారాయి. కనీసం వాకింగ్ చేసేందుకు కూడా అనువుగా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కలెక్టర్ ప్రత్యేక నిధులే కాకుండా, మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి ఈ మూడేళ్లలో పార్కుల అభివృద్ధికి రూ. 85లక్షలు ఖర్చు చేశారు. గాంధీ పార్కు, ఎల్ఐజీ పార్కు, సాకేత్ నగర్‌లోని పార్కులు సేద తీరేందుకు కొంత అనువుగా ఉన్నా, వాటి నిర్వహణ సక్రమంగా లేదు. ఈ రెండు పార్కుల్లో సుమారు రూ. 9లక్షలు ఖర్చు చేసి ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. అవి కొంతకాలం ప్రజలకు ఉపయోగపడినా.. నేడు నిరుపయోగంగా మారాయి. మున్సిపల్ పరిధిలోని ప్రతి లే-అవుట్‌లో పార్కు కోసం స్థలం కేటాయించారు. ఈ లెక్కన పట్టణ పరిధిలో 116 వరకు పార్కుల స్థలాలు ఉన్నాయి. అయితే చాలా వరకు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అవి ప్రజలకు ఉపయోగపడడం లేదు. హరితహారంలో భాగంగా ప్రతి ఏటా పార్కుల్లో మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పార్కులు ప్రజలు, పిల్లలకు ఉపయోగపడేలా చొరవ తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

సేవలు ఏవీ?

- ప్రతి పంచాయతీకి ఇంటర్‌నెట్ సదుపాయానికి ప్రభుత్వ నిర్ణయం
- కొన్ని గ్రామాల్లో బీబీఎన్ఎల్ బాక్స్‌ల బిగింపుతో సరి
- మూలన పడుతున్న పరికరాలు
- పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా అందని 'ఈ–సేవలు'



ఇంటర్‌నెట్ కనెక్షన్ లేక పంచాయతీలో వృథాగా కంప్యూటర్



చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో వృథాగా బీబీఎస్ఎల్ బాక్స్

చేవెళ్ల: పంచాయతీల్లో పాలన పారదర్శకత, ఆదాయ, వ్యయాల్లో కచ్చితత్వం ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వం ఊరూరా ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ–సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. తెలంగాణ ఫైబర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జిల్లాలోని పల్లెలను ఇంటర్‌నెట్‌తో అనుసంధానం చేసేందుకు భూగర్భ లైన్ల ద్వారా వైర్లు వేసి బీబీఎస్ఎల్ బాక్స్‌లను బిగించింది. జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి పనులు చేపట్టింది. ఇంతవరకు బాగానే ఉన్నా పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పంచాయతీలకు ఇంటర్‌నెట్ సేవలు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. ఇప్పటి వరకు ఒక్క పంచాయతీకి కూడా నెట్ కనెక్షన్ ఇవ్వలేదు. లైన్లు వేసి కంప్యూటర్లు ఇచ్చిన పంచాయతీల్లోనూ ఎక్కడా ఈ–సేవలు అందుబాటులోకి రాలేదు. ఇంకా కనెక్షన్ ఇచ్చే పనిలోనే ఉన్నారు.

సమస్త సమాచారం పొందుపర్చేలా..

ప్రతి పంచాయతీకి అందించే ఈ–సేవలతో గ్రామాల్లో మెరుగైన పౌరసేవలు అందించేందుకు వీలవుతుందని ప్రభుత్వం భావించింది. పనులకు సబంధించి నివేదికలు తయారు చేయటంతోపాటు జనన, మరణ, వివాహహ తదితర ధ్రువీకరణ ప్రతాలను ఆన్‌లైన్‌లో అందించడం ఈ–సేవల ముఖ్య ఉద్దేశం. టాక్స్‌ల వసూళ్లు, పెన్షన్లు, వ్యక్తిగత సమాచారాలు, గ్రామ ప్రణాళికలు, అనుమతులు, గ్రామసభల నిర్వహణ తదితర అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా పంచాయతీ నిర్వహణ మొత్తం పారదర్శకంగా ఉంటుందని ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పల్లె ప్రగతి నివేదికలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పంచాయతీలకు అందించే నిధులు, వీటికి సంబంధించి పనులు, ఖర్చులు, అన్ని వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేయటం ద్వారా కచ్చితమైన సమాచారం ఉంటుందని భావించింది. ఇంటర్‌నెట్ సౌకర్యంతో సమయం ఆదా కావడంతో పాటు పనులు త్వరగా పూర్తవుతాయని యోచించింది.

అందుబాటులోకి ఎప్పుడో..

పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక కావడంతో జిల్లాలోని 560 గ్రామాల్లో పనులు ప్రారంభించి బీబీఎస్ఎల్ వారు ఇంటర్‌నెట్ కనెక్షన్ల బాక్స్‌లు బిగించారు. బిగించిన పరికరాలు మూలన పడుతున్నాయి తప్ప నెట్ సౌకర్యం మాత్రం రావటం లేదు. సగానికిపైగా పంచాయతీల్లో వీటిని బిగించనే లేదు. ఇవి ఎప్పుడు అందుబాటులోకి వస్తాయా అని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సిబ్బంది ఎదురు చూస్తున్నారు.


బాక్స్‌లు బిగించి వదిలేశారు



అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. కంప్యూటర్, ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వడంతోపాటు ఆ పరేటర్లను ఇస్తామన్నారు. బీబీఎస్ఎల్ సంస్థకు సంబంధించిన బాక్స్‌లను బిగించి వదిలేశారు. సర్పంచ్‌గా పదవీకాలం పూర్తి కావస్తున్నా ఈ–సేవల ఊసేలేదు.

– రాజశేఖర్, సర్పంచ్, ఈర్లపల్లి

అందుబాటులోకి వస్తే మేలు



ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇస్తే అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చూస్తాం. పంచాయతీకి సంబంధించి పూర్తి వివరాలు కంప్యూటర్ ద్వారా అందరికీ అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, వాటితో చేపట్టే పనుల వివరాలు నమోదు చేయడం ద్వారా కచ్చితమైన సమాచారం ఉంటుంది.

– భీమయ్య, సర్పంచ్, మీర్జాగూడ

క్లుప్తంగా

పుట్టినరోజే అనంతలోకాలకు..

- యాదాద్రికి వెళ్లి వస్తుండగా బైక్‌ను ఢీకొట్టిన డీజిల్ ట్యాంకర్
- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

తలకొండపల్లి: పుట్టినరోజున యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి బైక్‌పై స్నేహితులతో కలిసి వెళ్లిన ఓ యువకుడుని మృత్యువు కబలించింది. పోలీసులు తెలిపిన వివరాలు... తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్‌లో గ్రామానికి చెందిన సప్పిడి శ్రీనివాస్ (20).. తన పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం స్నేహితులతో కలిసి బైక్‌పై యాదగిరిగుట్టకు బయలు దేరాడు. మార్గ మధ్యలో బీబీనగర్ టోల్‌గేట్ సమీపంలో ప్రమాదవశాత్తు డీజిల్ ట్యాంకర్ శ్రీనివాస్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్‌కు బలమైన గాయాలవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక ఉన్న విష్ణు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. శ్రీనివాస్ మరణంతో రాంపూర్‌లో విషాదఛాయలు లుముకున్నాయి. తల్లిదండ్రులు కృష్ణయ్య, సునీత కన్నీటి పర్యంతమయ్యారు. శ్రీనివాస్ శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్పల్లి: మండలంలోని కోట్‌మర్పల్లి గ్రామానికి చెందిన తలారి దుర్గాప్రసాద్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబానికి చైతన్య యువజన సంఘం సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఐదుగురికి కూడా వారు నగదు అందజేశారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఐకేపీ ఏపీఎం మధుకర్, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కేశంపేట: కాగ్నిజెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మండలానికి చెందిన కొత్తపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అఖిల, సౌభాగ్య ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సదరు విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అయ్యే ఖర్చును కాగ్నిజెంట్ పరిశ్రమ యాజమాన్యం భరిస్తుందని పరిశ్రమ ప్రతినిధులు శైలజ, శివ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస సాగర్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు అభినందించారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్ల పట్టివేత

శంషాబాద్ రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. పెద్దగోల్కొండకు చెందిన ఎస్.శ్రీశైలం అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. దీంతో అక్కడకు వెళ్లి పరిశీలించగా.. షెడ్డులో బీరు, విస్కీ బాటిళ్లు లభించాయి. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం సీజ్..

శంషాబాద్ రూరల్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగోల్కొండ శివారు లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నట్లు ఆదివారం పోలీసులకు సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించగా.. ఆటో ట్రాలీలో బియ్యం బస్తాలు ఉన్నాయి. రేషన్‌బియ్యయ్యాన్ని స్టేషన్‌కు తరలించారు. బియ్యం సేకరిస్తున్న వ్యక్తిని యాదాద్రి జిల్లా బొమ్మలరామారం వాసి డి.బాస్కర్‌గా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కిన బియ్యం తినేదెలా?

- గుండాల రేషన్ దుకాణానికి ముక్కిన, పురుగు బియ్యం సరఫరా
- దుకాణం ఎదుట కార్డుదారుల ఆందోళన
- స్టాక్‌ను వెనక్కి పంపించిన డీలర్





ముక్కిన బియ్యాన్ని చూపిస్తున్న లబ్ధిదారులు, ఆదివారం సరఫరా చేసిన బియ్యం

దోమ: అధికారుల నిర్లక్ష్యంతో రేషన్ దుకాణాల్లో ముక్కిన బియ్యం, పురుగులు పట్టిన బియ్యం సరఫరా అవుతున్నాయి. ఆదివారం దోమ మండల పరిధిలోని గుండాల గ్రామానికి గొడౌన్ నుంచి రేషన్ బియ్యం వచ్చాయి. అయితే ఆ బియ్యం పురుగులు, తుట్టెలు పట్టి నాసిరకంగా ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బియ్యం మాకొద్దంటూ రేషన్ దుకాణం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. గతంలో పలుమార్లు ఇలాంటి బియ్యాన్నే సరఫరా చేశారని, మళ్లీ అలాంటి బియ్యాన్నే లబ్ధిదారులకు అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపించారు.

ఈసారికి సర్దుబాటు చేసుకోండి..

గ్రామానికి గత కొన్ని నెలలుగా పురుగులు, తుట్టెలు పట్టిన బియ్యాన్నే సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఆదివారం గుండాల గ్రామానికి 76 క్వింటాళ్ల రేషన్ బియ్యం వచ్చాయి. అందులో పురుగులు, తుట్టెలు పట్టిన బియ్యంతో పాటు బియ్యం తడిసిపోయి వచ్చాయని గ్రామస్తులు చెబుతున్నారు. నాణ్యతతో కూడిన బియ్యం తీసుకురావాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరితే.. ఈసారికి సర్దుబాటు చేసుకోండి.. అంటూ సమాధానం చెబుతున్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. దీంతో రేషన్ దుకాణం ఎదుట లబ్ధిదారులు ఆందోళన చేయడంతో సంబంధిత అధికారులు బియ్యాన్ని తిరిగి తీసుకువెళ్లారు.

నాణ్యత పట్టని అధికారులు..

రేషన్ దుకాణాలకు పంపించే ముందు క్వాలిటీ కంట్రోల్ అధికారులు బియ్యాన్ని చెక్ చేయాలి. బాగున్నాయి అనుకున్న తర్వాతే బియ్యాన్ని డీలర్లకు సరఫరా చేయాలి. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే అలా జరగడం లేదని తెలుస్తోంది. అధికారుల నిర్లక్ష్యానికి బియ్యంలో క్వాలిటీ చెక్ చేయకుండానే రేషన్ బియ్యన్ని పంపిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మామూళ్లు తీసుకుంటూ నాణ్యత లేని బియ్యాన్ని సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

“ ఫిర్యాదు చేసినా అంతే..



గ్రామానికి వచ్చే బియ్యం నాణ్యతతో రావడం లేదు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ముక్కిన, తుట్టెలు పట్టిన బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి.

– గోవర్ధన్, రేషన్‌కార్డుదారుడు, గుండాల

చర్యలు తీసుకుంటాం



రేషన్ దుకాణాలకు పంపించే బియ్యంలో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకుంటాం. గుండాల గ్రామానికి వచ్చిన బియ్యం బాలేవంటూ గ్రామస్తులు చెప్పారు. అట్టి బియ్యాన్ని మళ్లీ గొడౌన్‌కు పంపించాం. ప్రతి రేషన్ దుకాణానికి నాణ్యమైన బియ్యం సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున్, సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీ

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఓ సెల్ ఫోన్ రిపేర్ దుకాణంలో చోరీ జరిగింది. ఎస్ఐ నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సయ్యద్ మునాఫ్ అలీ మహేశ్వరం చౌరస్తాలో మొబైల్ రిపేర్ షాపు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరే శనివారం రాత్రి 10 గంటలకు షాప్‌ను మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం దుకాణాన్ని తెరిచేందుకు రాగా చోరీ జరిగిన విషయాన్ని గమనించాడు. రూ.15 వేలు విలువ చేసే పాత సెల్ ఫోన్లను దొంగలు ఎత్తుకెళ్లారు. షాపు వెనుక నుంచి కన్నం వేసి షాపులో ఉన్న పాత సెల్ ఫోన్లు, రిపేరింగ్‌కు వచ్చిన ఫోన్లు ఎత్తుకెళ్లారు. దీంతో అలీ మహేశ్వరం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



గోడకి వేసిన కన్నం

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



కౌన్సిలర్లు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: పరిగి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. టీయూఎఫ్ఐడీసీ నుంచి పరిగి మున్సిపాలిటీకి రూ.25 కోట్ల రుణం మంజూరు కావడంతో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. వార్డుల్లో ఎంత చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వాటికయ్యే ఖర్చు వంటి విషయాలపై అధికారులు, కౌన్సిలర్లతో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని కొత్త కాలనీల్లో సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్ వంటి పనులు చేపట్టాలన్నారు. మంత్రి కేటీఆర్ చొరవతో మున్సిపాలిటీకి రూ.25కోట్ల రుణం అందిందన్నారు. వార్డు కౌన్సిలర్లు ఆయా అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి రు.5కోట్లు మంజూరు చేయాలని కోరారమని త్వరలో నిధులు మంజూరవుతాయన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్, ఎంపీపీ అరవింద్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, కౌన్సిలర్లు రవీందర్, కిరణ్, వెంకటేష్, కృష్ణ, నాగేశ్వర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం..

దోమ: దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ అనుబంధ గ్రామమైన ఉదన్‌రావుపల్లి గ్రామ సమీపంలో ఉన్న పెద్దచెరువు కట్టమైసమ్మ నూతన ఆలయ ప్రారంభోత్సవానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయానికి వ్యక్తిగతంగా రూ.50వేల విరాళం అందజేశారు. స్థానిక సర్పంచ్ రాజిరెడ్డి, జెడ్పీటీసీ నాగిరెడ్డితో కలసి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దాదాపూర్ గ్రామంలో జరిగే పోచమ్మ బోనాల ఉత్సవాలకు హాజరయ్యారు. స్థానిక సర్పంచ్ కృష్ణ, గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ లక్ష్మయ్య, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, దాదాపూర్ ఎంపీటీసీ నర్సింహులు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ భీంసేన్, మాజీ చైర్మన్ శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయులు బిచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని గంజిపల్లి గ్రామానికి చెందిన కాషప్పకు సీఎం సహాయం కింద మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

వ్యసనాలతో భవిత ప్రశ్నార్థకం

- మద్యానికి బానిసవుతున్న యువత
- రోడ్డు ప్రమాదాల్లో జీవితాలను కోల్పోతున్న వైనం
- తల్లిదండ్రులకు తీరని శోకం



డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

దౌల్తాబాద్: యువతంటే మార్పును ఆశించే కొత్తతరం. అవకాశాలను అందిపుచ్చుకొని భవితకు బాటలు వేసుకునే నవశక్తి. తలుచుకుంటే ఏదైనా సాధించే ఆత్మవిశ్వాసం వారి సొంతం. అయితే కొందరు చెడు వ్యసనాలకు బానిసై పెడదోవపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భావిపౌరులు వ్యసనాలకు బానిసవుతూ భవితను ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్నారు. మద్యం, పొగతాగడం వంటి దురలవాట్లకు బానిసవుతున్నారు. దీంతో చిన్న వయసులోనే రోగాలపాలవుతున్నారు. వారిని రక్షించుకునేందుకు తల్లిదండ్రులు నానాపాట్లు పడుతున్నారు. ఇలా రోగాలతో కొందరు మంచానికే పరిమితమవుతుంటే.. మరికొందరు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తిరిగిరాని లోకాలకు వెళ్తున్నారు.

మద్యానికి బానిసై..

మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇటీవల మద్యం సేవించి వాహనం నడపడంతో అదుపుతప్పి కిందపడి ఆస్పత్రిపాలయ్యాడు. దౌల్తాబాద్ గ్రామానికి చెందిన మరో యువకుడు మద్యం తాగి బైక్‌పై నుంచి కిందపడటంతో ప్రాణాలు పొగొట్టుకుని వారి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చాడు. ఇలా అనేక ఘటనలు తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిల్చాయి. వ్యసనాలకు బానిసలైన యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. బాగా చదువుకుని ప్రయోజకులై.. కన్నవారి కలలు నెరవేరుస్తారనుకుంటే.. వారికే భారమవుతున్నారు. పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువకుల్లో పరివర్తన తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

“ అవగాహన కల్పిస్తున్నాం



డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ యువకులకు అవగాహన కల్పిస్తున్నాం. తాగి వాహనం నడిపే ముందు భార్య, పిల్లలు తల్లిదండ్రులను గుర్తుచేసుకోవాలని చెబుతున్నాం. తాగి వాహనం నడపటం వల్ల ప్రమాదాలకు గురైతే కుటుంబం వీధిన పడుతుందని అవగాహన కల్పిస్తున్నాం. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.

– రమేష్‌కుమార్, ఎస్ఐ, దౌల్తాబాద్

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



ఎమ్మెల్యే యాదయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్: యువత గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని అమ్డాపూర్ మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు, యువకులు ఎమ్మెల్యేను యాదయ్యను కలిసి సన్మానించారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అమ్డాపూర్ మాజీ సర్పంచ్ కోళ్ల సిద్దయ్య, గ్రామ ఉపసర్పంచ్ నాగార్జునచారి, వార్డు సభ్యులు, నాయకులు మన్నె ప్రభాకర్‌రెడ్డి, తూర్పు జితేందర్‌రెడ్డి, మద్యపాగ కృష్ణ, నర్సింహ, భూషణం, ప్రవీణ్, కుమార్, చంద్రపాల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు రైతుల సంక్షేమ సంఘం ఎన్నిక

తలకొండపల్లి: పట్టు రైతుల సంక్షేమం, పట్టు పరిశ్రమపై అవగాహన, పరిశ్రమాభివృద్ధితో కలుగు ప్రయోజనాలు, మార్కెట్‌లో లాభ నష్టాలు తదితర వాటిపై శనివారం రాత్రి హైదరాబాద్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టు రైతుల జిల్లా నూతన సంక్షేమ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని కోరింతకుంట తండాకు చెందిన శుక్రునాయక్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గట్టుఇప్పలిపల్లికి చెందిన రఫీక్, ప్రధాన కార్యదర్శిగా దేవిలాల్, కార్యదర్శిగా సంజీవ్‌కుమార్, కోశాధికారిగా ప్రశాంత్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టు పురుగుల పెంపకందారులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధితో మహిళ మృతి

షాద్‌నగర్ రూరల్: మూర్ఛవ్యాధితో ఓ మహిళ మృతి చెందింది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం చౌడూర్ గ్రామానికి చెందిన మంజుల(40) కొన్నేళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతుంది. మంజుల సోదరుడు శ్రీశైలంగౌడ్ షాద్‌నగర్‌లని నెహ్రూ నగర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 15న మంజుల సోదరుడి వద్దకు వచ్చింది. ఆదివారం ఇంటి అవసరాల కోసం బయటకు వచ్చిన మంజులకు మూర్ఛ వచ్చింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలుస్తోంది. శ్రీశైలంగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

తండ్రీకూతుళ్లపై వీధికుక్కల దాడి

శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ పరిధిలో వీధికుక్కల దాడి పరంపర కొనసాగుతోంది. తాజాగా ఆదివారం సాయంత్రం శేరిలింగంపల్లిలోని తారానగర్ మార్కెట్‌లో వీధి కుక్కలు ఓ కుటుంబంపై దాడి చేశాయి. ఈ దాడిలో తండ్రి, కూతురుకు గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే వారిని చికిత్స కోసం కొండాపూర్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం బోనాల పండుగ కావడంతో తెల్లాపూర్ ప్రాంతంలో నివాసం ఉండే రమేష్ తన భార్య ముగ్గురు పిల్లలతో కలిసి తారానగర్ మార్కెట్‌కు వచ్చాడు. అంతా నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో అక్కడే ఉన్న మూడు కుక్కలు వారిపై దాడి చేశాయి. ఈ కుక్కల దాడిలో చిన్నారి మౌనిక(6) చెంప, చెవి భాగాల్లో గాయాలయ్యాయి. ఇదే తరుణంలో మరోకుక్క తండ్రి రమేష్‌కాలుకు కరిచింది. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కొండాపూర్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ వారికి తగిన చికిత్స అందించారు.

ఖరము పాలకు పెరిగిన డిమాండ్



గాడిద పాలను పితుకుతున్న యువకుడు

కందుకూరు: గంగి గోవు పాలు గరిటడైనా చాలు అనే సామెతను మరిపించేలా, అందుకు భిన్నంగా చెంచాడైనా చాలు ఖరముపాలు ఆరోగ్యానికి మేలు అన్న చందంగా ఉంది పరిస్థితి. వర్షా కాలం ప్రారంభం కావడంతో వాతావరణ మార్పుల వల్ల జలుబు, దగ్గు, దమ్ము వంటి అనారోగ్యాలతో ప్రజలు సతమతమవుతున్నారు. గాడిద పాలతో జలుబు, దగ్గు, దమ్ము వంటి జబ్బులు తగ్గుతాయనే నమ్మకం చాలా మందిలో ఉంది. దీంతో గాడిద పాలకు డిమాండ్ పెరిగింది. భైంసా, కామారెడ్డి ప్రాంతాల నుంచి కొందరు పెంపుడు గాడిదలతో వచ్చి ఇంటింటికీ తిరుగుతూ పాలను అమ్ముతున్నారు. ఆసక్తి ఉన్న వారు పాలను కొనుగోలు చేస్తున్నారు. 30 మి.లీ. పాలను రూ.100 వరకు విక్రయిస్తున్నారు. తల్లిదండ్రులు.. పిల్లలకు జలుబు, దగ్గు తక్కువైతుందని ఎంత రేటైనా పెట్టి కొంటున్నారు. దీంతో గాడిదపాలుకు డిమాండ్ ఎక్కువైంది.

వికలాంగులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలి



వాయిస్ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎన్‌పీఆర్‌డీ సభ్యులు, వికలాంగులు

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్

కొడంగల్ రూరల్: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు దశరథ్ ఆధ్వర్యంలో వికలాంగుల వాయిస్ మాస పత్రికను ఆదివారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా, రాష్ట్రం, దేశంలో జరుగుతున్న అనేక విషయాలను పత్రికలో ప్రచురించడం జరుగుతుందని అన్నారు. వికలాంగుల నూతన చట్టం–2016 సెక్షన్ల వారీగా మాసపత్రికలో ప్రచురిస్తున్నారని అన్నారు. వికలాంగులకు సంబంధించి అనేక రకాల జీఓలను, వికలాంగులను చైతన్య పరిచేందుకు, సాధించిన విజయాలను తెలుసుకునేందుకు ఈ మాసపత్రిక ఉపయోగపడుతుందని అన్నారు. వికలాంగులకు నెలకు పదివేల రూపాయల పెన్షన్ అందించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలంటూ డిమాండ్లను ప్రచురించడం జరుగుతుందని అన్నారు. వికలాంగుల కొరకు పొందుపరిచిన వాయిస్ మాసపత్రికను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా మీడియా కోఆర్డినేటర్, మండల కమిటీ సభ్యులు రాజ, భాగ్యమ్మ, వెంకటయ్య, బసంత్, ఈశ్వర్, జిల్లా మీడియా కోకన్వీనర్ మారుతీ పాల్గొన్నారు.

సాగుకు ఊతమిచ్చేలా..

- ద్రవరూప ఎరువుల ఆవిష్కరణలో శాస్త్రవేత్తల ముందడుగు
- త్వరలో అగ్రోస్, డీసీఎంఎస్ దుకాణాల్లో అందుబాటులోకి



ఎరువుల దుకాణం

షాబాద్: సాగులో రైతులకు ఊతమిచ్చే కొత్త ఆవిష్కరణకు వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటివరకు డీఏపీ, యూరియాను రైతులు ఘన రూపంలో వాడేవారు. ఇప్పుడు నూతన పద్ధతి ద్వారా ఈ రెండింటిని ద్రవరూపంలో తీసుకువచ్చారు. 50 కిలోల డీఏపీ, యూరియా ఎంత విస్తీర్ణానికి సరిపోతుందో.. అరలీటర్ డీఏపీ, అరలీటర్ యూరియా ద్రవరూపంలో అంతే విస్తీర్ణానికి సరిపోనుంది. దీంతో ఘనరూప ఎరువుల కన్నా.. ద్రవరూపానికే సుమారు 8 శాతం పంట దిగుబడి పెరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మార్కెట్లో ఘన, ద్రవరూప ఎరువులు లభిస్తున్నాయి. ఇంతవరకు బస్తాల్లో ఘనరూపంలో యూరియా, డీఏపీ లభించేది. ఇప్పుడు ద్రవరూపంలోనూ అందుబాటులోకి వచ్చాయి. అంతకుముందు 50 కిలోల డీఏపీ బస్తా రూ.1,350, యూరియా బస్తా రూ.266 మార్కెట్‌లో ధర ఉంది. అయితే (ఇఫ్కో) కంపెనీ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన నానో డీఏపీ అర లీటర్‌కు రూ.600, యూరియా అరలీటర్ రూ.240 ధరతో అందుబాటులోకి తెచ్చింది. ద్రవరూప యూరియాపై రూ.26(266–240) డీఏపీ పై రూ.750(1350–600) వరకు ప్రయోజనం చేకూరుతోంది.

ద్రవరూప ఎరువుల ప్రయోజనం

అధికారుల అంచనా ప్రకారం ద్రవరూప ఎరువులతో పంటకు సుమారు 90 శాతం వరకు ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. ఘనరూప డీఏపీ వరి నాటు వేసేటప్పుడు బస్తా డీఏపీ ఎంత విస్తీర్ణంలో వినియోగిస్తారో.. ద్రవరూప డీఏపీ అర లీటర్ బాటిల్ పొలంలో పిచికారీ చేస్తే సరిపోనుంది. ఇలా చేయడం వల్ల మొక్కలకు నత్రజని సమర్థవంతంగా అందుతుంది. మొక్క వేర్లలో కణజాలం వృద్ధిచెందటంతో పాటు పంట ఉత్పత్తిలో పోషక విలువలు పెరుగుతాయి.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

తుర్కయంజాల్: రాజకీయలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తుర్కయంజాల్‌లోని సాగర్ రహదారి నుంచి నాదర్‌గుల్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.16 కోట్లతో చేపట్టనున్న ఈ బీటీ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. రెండు నెలల్లో రోడ్డు పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రోడ్డు విస్తరణలో విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు అయ్యే ఖర్చు రూ. 5 లక్షలను ఎమ్మెల్యే నిధుల నుంచి కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని.. ఎన్నికల అనంతరం అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్‌నాయక్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.